సచివాలయాలకు.. చంద్ర గ్రహణం!



పలాసపురం సచివాలయ భవనం

- ప్రజలకు దూరమవుతున్న సేవలు
- రెండు సచివాలయాలు ఒకటిగా విలీనం

సోంపేట:

గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు విశేష సేవలందించిన గ్రామ సచివాలయాలకు కూటమి ప్రభుత్వ హయాంలో చంద్ర గ్రహణం పట్టిందనే విమర్శలు వస్తున్నాయి. పరిపాలన వికేంద్రీకరణ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందించాలనే లక్ష్యంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. సుమారు 530 రకాల సేవలను ప్రజలకు అందించే విధంగా చర్యలు తీసుకున్నారు. అయితే కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తున్నట్టు ప్రజలు భావిస్తున్నారు.


రెండు సచివాలయాలను ఒక క్లస్టర్‌గా..

రెండేసి గ్రామ సచివాలయాలను ఒక క్లస్టర్‌గా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుటుంది. సోంపేట మండలంలోని 24 సచివాలయాలను 13 క్లస్టర్లుగా ఏర్పాటు చేసేందుకు అధికారులు ఇప్పటికే నివేదికలు సిద్ధం చేశారు. ఇది అమల్లోకి వస్తే ఇప్పటి వరకు కిలోమీటరు దూరంలో సేవలు అందుకుంటున్న ప్రజలకు ఇబ్బందులు తలెత్తడం ఖాయంగా భావిస్తున్నారు. పలాసపురం సచివాలయాన్ని సోంపేట సచివాలయం-1లో విలీనం చేయడానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలుస్తుంది. ఇదే జరిగితే పలాసపురం నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న సోంపేట వెళ్లడానికి ఇబ్బందులు తప్పవని ప్రజలు వాపోతున్నారు. అలాగే మాకన్నపురం నుంచి పాత్రకొండ సుమారు ఐదు కిలో మీటర్ల దూరం ఉంటుంది. రెండు సచివాలయాలను కలిపి ఒక క్లస్టర్‌గా చేసేందుకు అధికారులు నివేదికలు పంపారు. దీంతో రెండు సచివాలయాల్లో ఏ సచివాలయాన్ని క్లస్టర్‌గా మార్చినా ఇంకో సచివాలయం పరిధిలోని ప్రజలు ఇబ్బందులు పడాల్సిందే. బేసిరామచంద్రాపురం, కొర్లాం సచివాలయాల దూరం కూడా సుమారు ఐదు కిలో మీటర్లు ఉంటుంది. దీంతో ఈ రెండు సచివాలయాల ప్రజలకు ఇబ్బందులు తప్పేలా లేవు. ప్రస్తుతం ఉన్న సచివాలయ వ్యవస్థనే కొనసాగించి, సచివాలయ ఉద్యోగులను పూర్తిస్థాయిలో భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉద్యోగుల కుదింపు

మండలంలోని 24 సచివాయలాను 13 క్లస్టర్లుగా కుదించి మిగతా 11 సచివాలయాల్లో ఉద్యోగులను కుదించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. 11 సచివాలాయాల్లో మహిళా పోలీసు, పంచాయతీ కార్యదర్శి ఉంటారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తు న్న డిజిటల్, వెల్ఫేర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వ్యవసాయ సహాయకులు, పశుసంవర్ధక శాఖ సహాయకులను వేరేచోటకు బదిలీ చేయడానికి ప్రభుత్వం నిర్ణయించినట్టు ప్రచారం జరుగుతుంది. సచివాలయాల పరిధిలో ఇంజినీరింగ్ అసిస్టెంటు ఉండడంతో ప్రభుత్వం అందజేస్తున్న ఇళ్ల బిల్లులు, భవన నిర్మాణ పనులు ముందుకు సాగుతున్నాయి. వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖ సహాయకులు గ్రామాల్లోని రైతులకు విలువైన సేవలు అందజేస్తున్నారు. వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర వహిస్తున్నారు. వీరి సేవలు దూరమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పవనే ఆందోళన వ్యక్తమవుతుంది.

పునరాలోచన చేయాలి..



గత ప్రభుత్వం పేద ప్రజలకు ఇంటివద్దకే సేవలను అందించాలనే సదుద్దేశంతో ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థను కొనసాగించాలి. వీటిని కుదించడం వలన ప్రజలకు ఇబ్బందులు తప్పవు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు తగ్గుతాయి. ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

– ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, సోంపేట

సచివాలయాన్ని కొనసాగించాలి



పలాసపురం సచివాలయాన్ని సోంపేటలో విలీనం చేయడానికి అధికారులు నివేదికలు తయారు చేస్తున్నట్టు తెలిసింది. సోంపేటలో తమ సచివాలయాన్ని విలీనం చేస్తే పలాసపురం, లక్కవరం ప్రజలు ఇబ్బందులు పడతారు. నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న సోంపేట వెళ్లి సేవలు పొందాలంటే వృద్ధులు, దివ్యాంగులకు కష్టం. అధికారులు స్పందించి పలాసపురం సచివాలయాన్ని కొనసాగించడంతో పాటు, సచివాలయాలను కుదించడకుండా చర్యలు తీసుకోవాలి.

– తడక జోగారావు, పలాసపురం సర్పంచ్

క్లుప్తంగా

ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

సోంపేట: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ చిన్నాజీ వర్మ గురువారం తెలిపారు. ఫలితాల వివరాలను పాఠశాల నోటీస్ బోర్డులో ఉంచామన్నారు. కొద్ది రోజుల్లో మెరిట్ లిస్టు తయారు చేసి ప్రవేశానికి ఎంపికైన వారికి ఫోన్ ద్వారా సమాచారం ఇస్తామన్నారు. ప్రవేశ సమయంలో కుల, జనన, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, మూడు ఫొటోలు, విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్‌లు, రికార్డ్ షీట్ అందజేయాల్సి ఉంటుందన్నారు.

ఇచ్ఛాపురం: పురుషోత్తపురం ఆదర్శ పాఠశాలలో 2025-26 సంవత్సరానికి ఆరో తరగతిలో చేరేందుకు నిర్వహించిన పరీక్ష ఫలితాలు విడుదలయ్యావని ప్రిన్సిపాల్ డి వైకుంఠరావు తెలిపారు. బుద్దా నవ్యశ్రీ 88, బుద్దా నవీనశ్రీ 85, ఉప్పాడ కుసుమ 82 మార్కులను సాధించారన్నారు. జిల్లా కలెక్టర్ అనుమతితో రోస్టర్ ప్రకారం సీట్లు కేటాయిస్తామన్నారు.

మినీ రిజర్వాయర్‌గా సీత సాగరం

నందిగాం: మండలకేంద్రంలోని సీత సాగరం చెరువును మినీ రిజర్వాయర్‌గా తీర్చిదిద్దుతామని వంశధార ఎస్ఈ ప్రగడ వెంకట తిరుపతిరావు అన్నారు. గురువారం ఆ శాఖ ఈఈ శేఖరరావుతో కలిసి సీతసాగరాన్ని పరిశీలించారు. రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు సూచనల మేరకు సాగు, తాగ నీటి అవసరాల కోసం, టూరిజం హబ్‌గా రూపాంతరం చెందిస్తామన్నారు. పరిశీలనలో ఏఈలు భాస్కర్, అభిషేక్, నీటి సంఘం అధ్యక్షుడు కొన్ని జయరాం ఉన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

పలాస: పలాసలోని డాక్టర్ కణితీస్ ప్రభుత్వ ఐటీఐలో వివిధ కోర్సుల్లో ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ పైల జవహర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో ఈ నెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం 94928 43849 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ప్రహరీ ప్రారంభం



ప్రహరీ ప్రారంభంలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

కవిటి: మున్నిపుట్టుగలోని హరిచండీ ఆలయం సామాజిక మండపానికి నిర్మించిన ప్రహరీని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ గురువారం ప్రారంభించారు. జెడ్పీ నిధులు రూ. 5 లక్షలతో దీన్ని నిర్మించారు. అంతకుముందు నూతనంగా నిర్మించిన హరిచండీ దేవి ఆలయం ప్రతిష్ట ఉత్సవాలో పూజలు నిర్వహించారు.

సామాజిక మండపం నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న నాయకులు

కవిటి: రాజపురం హైస్కూల్ జంక్షన్‌లో సామాజిక మండపం నిర్మాణానికి ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీపీ కడియాల పద్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రకాష్ గురువారం శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ 15వ ఆర్థికసంఘం నిధులు రూ. 4 లక్షలతో మండపాన్ని నిర్మిస్తున్నట్టు ఎంపీపీ తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు సనపల కృష్ణారావు, సత్యనారాయణ పాడి, వైఎస్సార్‌సీపీ యూత్ కన్వీనర్ ఎన్ని అశోక్, బి.వెంకటరావు పాల్గొన్నారు.

స్పోకెన్ ఇంగ్లిష్‌పై అవగాహన



టెక్కలి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు గురువారం స్పోకెన్ ఇంగ్లిష్‌తో పాటు క్యారమ్స్ తదితర ఆటలపై అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి బి.రూపావతి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు రవికుమార్, కె.రాజు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై శిక్షణ నిర్వహించారు.

–టెక్కలి

ఆధ్యాత్మిక సేవలో..



సోంపేట మండలం శారదాపురంలో సత్యనారాయణస్వామి దేవాలయం ప్రతిష్టామహోత్సవంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ గురువారం పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వైఎస్సార్ సీపీ కవిటి మండల అధ్యక్షులు కడియాల ప్రకాష్, నాయకులు గోకర్ల ధర్మారావు, లింగరాజు పాల్గొన్నారు.

–సోంపేట

కుట్టు శిక్షణ ప్రారంభం



మహిళలు టైలరింగ్‌లో నైపుణ్యం నేర్చుకోవడం వల్ల వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఎంపీడీవో రమేష్ నాయుడు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ భావన దుర్యోధన అన్నారు. బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని గురువారం ప్రారంభించి మాట్లాడారు. సెంటర్ ఫర్ అర్బన్ అండ్ రూరల్ ఆర్గనైజేషన్ వారి ఆధ్వర్యంలో 90 రోజులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్గనైజేషన్ జిల్లా కో ఆర్డినేటర్ మెట్ట చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సోంపేట: కొర్లాంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం మరమ్మతులు చేపడుతున్నారు. ఈ కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పలాస ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.యజ్ఞేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ కొర్లాం, బారువ, పాలవలస, మామిడిపల్లి, తురకశాసనాం, గొల్లగండి, గొల్లూరు, బేసిరామచంద్రాపురం, కర్తలిపాలెం, సిరిమామిడి, ఎర్రముక్కాం, ఉప్పాలం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఉచిత న్యాయసేవలు పొందాలి

- పలాస జూనియర్ సివిల్ జడ్జి మాధురి



మాట్లాడుతున్న జడ్జి మాధురి

కాశీబుగ్గ: ఉచిత న్యాయ సేవలను కార్మికులు పొందాలని పలాస జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయాధికార సంస్థ చైర్మన్ యూ మాధురి అన్నారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల సహకారంతో కార్మికులకు ఉచిత న్యాయసేవలు అందజేస్తామన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఫయాద్ అహ్మద్, వైస్ ప్రెసిడెంట్ బి.కె.ఆర్.పట్నాయక్, జాయింట్ సెక్రెటరీ జి.ఎం.ఎస్.అనిల్‌రాజ్, సీనియర్ న్యాయవాదులు పైల రాజరత్నం, వై.హేమకుమార్, చంద్రశేఖర్, తాండ్ర మురళీమోహన్, జి.ప్రభాకర్, హనుమంతు సుధారాణి, చాపర దివ్య, చిట్టిబాబు, శ్రీనివాసరావు, శ్యామసుందర్ పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాలు ప్రారంభం



టెక్కలి: శిబిరాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

టెక్కలి: శాప్ ఆధ్వర్యంలో టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో గురువారం కబడ్డీ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఎస్ఆర్ఆర్ కబడ్డీ క్లబ్ ప్రెసిడెంట్ డి.కొండలరావు దీన్ని ప్రారంభించారు. ఉదయం 5:30 నుంచి ఏడు గంటల వరకు, సాయంత్రం 4:30 నుంచి 6:30 గంటల వరకు శిక్షణ నిర్వహిస్తున్నట్లు కోచ్ ఎన్.నీలయ్య, రమేష్ వెల్లడించారు. శిక్షణకు హాజరయ్యే విద్యార్థులకు అల్పాహారం, మజ్జిగ, మంచినీటిని అందజేస్తామన్నారు.

మందస: బహడపల్లి గ్రామస్తుల సహకారంతో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మందస జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. నెల రోజుల పాటు 15 మంది ఉపాధ్యాయులు హాజరై 60 విద్యార్థులకు ప్రతిభకు సంబంధించి శిక్షణ ఇవ్వనున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షులు సాలిన ఉమాపతి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మాధవరావు పాల్గొన్నారు.

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా క్రీడా ప్రాధికారి ఆధ్వర్యంలో అథ్లెటిక్స్, టెన్నికాయిట్, ఖోఖో క్రీడల శిబిరాన్ని ప్రారంభించారు. వ్యాయామ ఉపాధ్యాయ సంఘ కార్యదర్శి గజేంద్ర, పలాస ప్రభుత్వ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ తారక్, మల్లా భద్రయ్య, శ్రీకాకుళం జిల్లా టెన్నికాయిట్ సంఘ అధ్యక్షుడు సంతోష్, నాయకులు జోగ మల్లేష్, బద్రి శంకరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు పి.తవిటయ్య, కొణతాల రామారావు, బొండాటి తిరుమలరావు పాల్గొన్నారు.

కొబ్బరి రైతులను ఆదుకోవాలని వినతి

కవిటి: ఉద్దానం ప్రాంత కొబ్బరి రైతులను ఆదుకోవాలని రైతు సంఘాల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ బి.అశోక్‌ను రామయ్యపుట్టుగలోని క్యాంపు కార్యాలయంలో గురువారం కలిసి వినతిపత్రాన్ని అందించారు. కొబ్బరిపంటను ఆశిస్తున్న తెల్లదోమ, గ్యానోడెర్మా తదితర తెగుళ్ల నివారణకు ప్రభుత్వ సాయం అందించాలని వినతిపత్రంలో కోరారు. దెబ్బతిన్న జీడిసాగు చేస్తున్న రైతుకు పంటలబీమా వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు.

కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి

కార్మికులందరూ ఐక్యంగా ఉండాలని వక్తలు పిలుపునిచ్చారు. కార్మిక దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ, సీపీఐ, సీపీఎం, వివిధ ప్రజా సంఘాల నాయకులు హాజరై 'మే డే'ప్రాధాన్యతను వివరించారు. కార్మిక చట్టాలను కఠినంగా అమలు చేయాలని, పనికితగ్గ వేతనం గిట్టుబాటు అయ్యేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా కార్మిక జెండాను ఆవిష్కరించి ర్యాలీలు చేపట్టారు. పలువురు కార్మికులను సత్కరించారు.

–సాక్షి నెట్‌వర్క్



టెక్కలిలో సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో..



వజ్రపుకొత్తూరు రూరల్: బెండిలో పాటలు పాడుతున్న ప్రజాసంఘాల నాయకులు



సోంపేట: బారువలో పతాకావిష్కరణ చేస్తున్న సీపీఎం నాయకులు



టెక్కలిలో సీఐటీయూ ఆధ్వర్యంలో మే డే ర్యాలీ



పలాస: సూదికొండలో ర్యాలీ చేస్తున్న సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ సభ్యులు



కాశీబుగ్గ: జీడి కార్మిక సంఘ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తిని సత్కరిస్తున్న దృశ్యం



మందస: అంబుగాంలో నవోదయ భవానీ నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో..



మందస: హరిపురంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో మే డే సంబరాలు



నందిగాం: కార్మిక జెండాను ఎగురు వేస్తున్న యూటీఎఫ్ సభ్యులు



కాశీబుగ్గ: జీడి కార్మికుల పిల్లలను సత్కరిస్తూ..



కంచిలి: ఎర్ర జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

రేగులపాడు కనుమరుగు!



- ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌కు తొలగిన అడ్డంకులు
- ఊరుతో అనుబంధాలు కట్

పలాస: పచ్చని కొండల నడుమ ఉన్న రేగులపాడు గ్రామం ఇకపై కనుమరుగుకానుంది. అక్కడ ఆఫ్‌షోర్ రిజర్వాయర్ రూపుదిద్దుకుంటోంది. వాస్తవానికి ఆ గ్రామ ప్రజల త్యాగంతో మెళియాపుట్టి, నందిగాం, పలాస ప్రజల సాగునీటి వనరులకు నీరు అందుతోంది. ఆఫ్‌షోర్ నిర్మాణానికి 2008లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేశారు. ఇప్పుడు ఆ పనులు కొలిక్కి రానున్నాయి. ఇటీవల బడ్జెట్‌లో రూ. 99 కోట్లు నిధులు కేటాయించారు. ప్రస్తుతం బ్యాలెన్స్ పనులు పూర్తి చేయడానికి ప్రభుత్వం తగిన కార్యాచరణ చేపట్టింది. ఇటీవల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష రేగులపాడు వెళ్లి రైతులతో సమావేశం నిర్వహించారు.

రైతులు మాత్రం గ్రామంతో ఉన్న అనుబంధాన్ని వదులుకుంటామని..అయితే తమకు రావలసిన ప్యాకేజీలు వెంటనే చెల్లించాలని తేల్చి చెప్పారు. దీనికి ప్రభుత్వం కూడా అంగీకరించడంతో అడ్డంకులు తొలగిపోయాయి. రిజర్వాయర్‌కు మొత్తం 2795 ఎకరాల భూమి కావలసి ఉండగా ఇంకా 400 ఎకరాలు సేకరించాల్సి ఉంది. ప్రాజెక్టు పరిధిలో చీపురుపల్లి, దాసుపురం, శారదపురం, చిన్న గురువూరు, రేగులపాడు గ్రామాలు ఉన్నా యి. ఈ ప్రాజెక్టు వద్ద మధ్యలో ఉన్నదే రేగులపా డు. ఈ గ్రామంలో మొత్తం 158 కుటుంబాలు ఉన్నాయి. వీరిలో 118 మందికి నివాస స్థలాలు ఇచ్చారు. మిగతా వారి కోసం గోపీ వల్లబాపురం వద్ద ఒక కాలనీ నిర్మాణం చేశారు. కొంతమంది వెళ్లారు. మరికొంతమంది డబ్బులు తీసుకున్నారు. ఇంకా 30 మందికి డీ పట్టాలని డబ్బులు చెల్లించలేదు. వారంతా డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎంత డబ్బు ఇచ్చినా అదంతా తమ చేతుల్లో ఉండదని, ఊరుతో తమ జ్ఞాపకాలను చెరుపేసుకోలేమని తరతరాల జ్ఞాపకాలను నెమరు వేసుకుంటున్నారు.

ఎకరా కలిసి పోయింది..



తనకు తాత తండ్రుల నుంచి వచ్చి ఎకరా భూమి రిజర్వాయలో కలిసిపోయింది. 2008లో ఎకరాకి రూ. 2.30 లక్షలు ఇచ్చారు. ఇప్పుడు ఆ ప్రాంతంలో ఎకరా రూ. 12 లక్షలు అయిపోయింది. వారి ఇచ్చిన డబ్బులు ఎప్పుడో ఖర్చు అయిపోయాయి. ఇంకా ఎకరా డీ పట్టా భూమి ఉంది. ఆ డబ్బులు ఇవ్వాలని కోరుతున్నాం.

–అంబలి రామారావు, రైతు, రేగులపాడు

బాధగా ఉంది..



నాకు మూడు ఎకరాలు ఉండేది. ఇందులో ఎకరన్నర రిజర్వాయర్‌లో కలిసిపోయింది. ఇంకా ఎకరాన్నర ఉంది. అక్కడ ఉండటానికి ఇల్లు లేదు. ఆ భూమిని వదల్లేము. గొర్రెలు, మేకలను దూరంగా తీసుకొని వెళ్లి మేపుతున్నాము. ఊరు విడిచి వెళ్లడం అంటే చాలా బాధాగా ఉంది. ఏంచేస్తాం.

–దాసరి తాతారావు, రేగులపాడు

కార్మికులకు హక్కులపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న జడ్జి నిర్మళ

టెక్కలి: కార్మికులకు వారి హక్కుల కోసం రూపొందించిన చట్టాలపై అవగాహన ఉండాలని టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి బి.నిర్మళ అన్నారు. కార్మిక దినోత్సవం సందర్భంగా టెక్కలి ఆర్టీసీ డిపో గ్యారేజీలో కార్మికుల హక్కులపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమం కోసం ఎన్నో రకాల రక్షణ చట్టాలు ఉన్నాయని.. వాటి కోసం పూర్తిగా తెలుసుకోవాల ని సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.అజయ్‌కుమార్, న్యాయవాదులు చంద్రశేఖర్ పట్నాయక్, పి.ఆనందరావు, ఎస్ఐ కె.రాము, డీఎం శ్రీనివాసరావు ఉన్నారు.

జీడి ఉత్పత్తిదారుల సంఘ కోశాధికారిగా వినయ్

కాశీబుగ్గ: పలాస పారిశ్రామిక వాడలో ఉన్న జీడీ ఉత్పత్తిదారుల సంఘం కోశాధికారిగా కొంచాడ వినయ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు పుష్పగుచ్ఛాలతో గురువారం సత్కరించి అభినందించారు. అధ్యక్షులు మల్లా రామేశ్వరం, కార్యదర్శి తూముల శ్రీనివాసరావు, సీనియర్ సభ్యులు తాళాసు నరసింహమూర్తి, కె.వి.గోపాల్ ఉన్నారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి



జగన్‌మోహన్‌రెడ్డితో శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

ఇచ్ఛాపురం రూరల్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి తాడేపల్లిలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

వైభవంగా మహారుద్ర యాగం



పూజలు చేస్తున్న మాజీ మంత్రి అప్పలరాజు, ఎమ్మెల్సీ రామారావు

కవిటి: చిన్నకర్రివానిపాలెంలో కాశీవిశ్వనాథస్వామి సింహద్వార ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్సీ నర్తు రామారావు పూజలు నిర్వహించారు. ఉపసర్పంచ్ చీకటి భూషణరాజు పాల్గొన్నారు.